సేవలు నిల్.. సర్వేలు ఫుల్

- సచివాలయ సేవలకు స్వస్తి పలికిన కూటమి ప్రభుత్వం
- సిబ్బందితో వివిధ రకాల సర్వేలు
- సెలవు రోజులోనూ పనులు అప్పగింత
- సర్టిఫికెట్లకు మీ–సేవ, మండల కేంద్రాలకు పరుగులు



సచివాలయంలో సేవలందిస్తున్న సిబ్బంది

మంగళగిరి: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్ ఇంటికి వచ్చి సేవలు అందించవారు. ప్రస్తుతం వలంటీర్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం తొలగించింది. సచివాలయ సేవలకు స్వస్తి పలకడంతో ప్రజలు మళ్లీ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగక తప్పడం లేదు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు సత్వరమే సేవలు అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు సేవలను పక్కన పెట్టి సర్వేల పేరుతో సచివాలయ సిబ్బందిని ఇంటింటికి తిప్పుతోంది. దీంతో ప్రజలకు సచివాలయాల్లో సేవలు అందకపోవడంతో.. సర్టిఫికెట్ల కోసం మీ –సేవా, మండల కేంద్రాలకు ప్రజలు పరుగులు తీస్తున్నారు.

కళకళలాడిని సచివాలయాలు..

మంగళగిరి నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 58 సచివాయాలున్నాయి. ఆయా సచివాలయాల్లో 600 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ప్రతి ప్రభుత్వ శాఖకు ఒక ఉద్యోగి చొప్పున ప్రతి సచివాలయంలో 11 మందిని నియమించారు. గత ప్రభుత్వంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సమన్వయంతో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి కుల ధృవీకరణ పత్రం నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాల వరకు అన్ని సేవలను సచివాలయంలోనే అందించేవారు.

సర్వేల పేరుతో..

కూటమి ప్రభుత్వం సచివాలయ సేవలకు స్వస్తి పలికింది. వివిధ రకాల సర్వేల పేరుతో సచివాలయ సిబ్బందిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందనే విమర్శలు వినపడుతున్నాయి. సెలవు రోజుతో సంబంధం లేకుండా సర్వేలు చేయాలని ఆదేశించడం, టార్గెట్‌లు పెట్టడం, మాతృ శాఖ పనులతో పాటు బీఎల్వో విధులు ఇలా అన్ని రకాల పనులు చేయాలని అధికారులు ఆదేశిస్తున్నారు. దీంతో సచివాలయ సిబ్బంది తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఆధార్ లేని పిల్లలను గుర్తించి వారికి ఆధార్ నమోదు చేయించాలి. పుట్టిన పిల్లలకు భర్త్ సర్టిఫికేట్, ఆధార్ నమోదు చేయించాల్సి ఉంది. వర్క్ ఫ్రమ్ హోమ్‌పేరుతో 18 ఏళ్ళ నుంచి 50 ఏళ్ల లోపు ఉన్న వారి జాబితాను తయారు చేయాలి. పీ4 సర్వే, నాన్ ఏపీ రెసిడెన్షియల్ వారిని గుర్తించడం, హౌస్ జియో ట్యాగింగ్ వంటి సర్వేలను చేస్తున్నారు. ఇంటింటికి తిరిగి సర్వే చేస్తున్నా ఇంటి యజమాని సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పకపోతే చేసిన పని అంతా వృధా అవుతుంది. మళ్లీ మొదటి నుంచి చేయాలని పలువురు సిబ్బంది వాపోతున్నారు.

సంక్షేమ ఫథకాలు నిల్

సర్వేలతో ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం ప్రజలకు అందించాల్సిన సూపర్ సిక్స్, సంక్షేమ పథకాల ఊసే ఎత్తడం లేదు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయాలన్ని ఏర్పాటు చేశారు. సచివాలయాలలో 545 ప్రభుత్వ సేవలు అందేలా ఏర్పాట్లు చేశారు.

కథ మొదటికొచ్చింది



గతంలో ఏ చిన్న అవసరం వచ్చినా సచివాలయానికి వెళ్లి పనులు చేయించుకునే వాళ్లం. సచివాలయంలో సిబ్బంది లేకపోవడంతో సేవలు నిలిచిపోయాయి. దీంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. ఏ పని అవసరమైనా మీ- సేవా కేంద్రాలకు, మండల కార్యాలయాలకు పరుగులు పెట్టక తప్పడం లేదు.

– సాలి ప్రశాంత్, శిబిరం బేతపూడి

ఇప్పుడు ఆ పరిస్థితి లేదు



సచివాలయాల ద్వారా ప్రజలకు అన్ని రకాల సేవలు అందేవి. సంక్షేమ పథకాలపై వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది వెంటనే సమాచారం అందిచేవారు. పథకాలకు అర్హులైన వారికి వారే దరఖాస్తులు పెట్టించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఏదైనా ధృవీకరణ పత్రాలు కావాలంటే మీ–సేవా, మండల కార్యాలయాలకు పరుగులు తీయాలి.

– మేకల రవికాంత్, మాజీ వలంటీర్

క్లుప్తంగా

మహం కాళీ దేవస్థానంలో చండీ హోమం

దుగ్గిరాల: కంతరాజు కొండూరులో వేంచేసి ఉన్న శ్రీ మహం కాళీ అమ్మవారి దేవస్థానం నందు శనివారం చైత్ర పౌర్ణమి సందర్భంగా చండీ హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. సత్యనాయణ హేమలత దంపతులు హోమ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యనిర్వహణాధికారి కె.సునీల్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మళ్లీ అఘోరీ వద్దకు శ్రీవర్షిణి

తన గురించి వెతకవద్దని తల్లితండ్రులకు సూచన

మంగళగిరి: పట్టణానికి చెందిన శ్రీవర్షిణి అనే యువతి అఘోరి అలవాల శ్రీనివాసరావుతో పారిపోగా తల్లితండ్రులు పట్టుకుని వెనక్కి తీసుకువచ్చారు. శ్రీ వర్షిణి మళ్లీ శనివారం ఉదయం ఇంటి నుంచి పారిపోయి అఘోరి వద్దకు చేరింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన గురించి తల్లితండ్రులు పట్టించుకోవద్దని, ముఖ్యంగా విష్ణుకుమార్ తనను వెంటాడడం మానుకోకపోతే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించింది. తన జీవితం అంతా అఘోరితోనే అని స్పష్టం చేసింది. శ్రీ వర్షిణి తల్లితండ్రులు శ్రీ వర్షిణి అఘోరి వద్దకు వెళ్లిందని తిరిగి తీసుకువచ్చి తమకు అప్పగించాలని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేటి నుంచి ఉచిత యోగా శిక్షణ

మంగళగిరి టౌన్ : శ్రీ వెంకటేశ్వర యోగా సేవ కేంద్ర కేంద్రమైన మంగళగిరి శాఖ ఆధ్వర్యంలో నేటి నుంచి ఉచిత యోగ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు శ్రీ వెంకటేశ్వర యోగి గురూజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 5.30 గంటలకు మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో ఈ శిబిరం ప్రారంభమవుతుందని, ఈ శిబిరంలో నాలుగు వారాల పాటు యోగాలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ కాలంలో 42 రకాల యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం, యోగ ముద్రలు నేర్పబడునని, వీటి ద్వారా 60 రకాల జబ్బులకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

గుంటూరు సినడు బిషప్‌గా డాక్టర్ ఏలియా



మంగళగిరి: గుంటూరు సినడు బిషప్‌గా డాక్టర్ సీహెచ్ ఏలియా ఎన్నికయ్యారు. మూడు రోజులుగా నగర పరిధిలోని యర్రబాలెం లూథరన్ దేవాలయం గుంటూరు సినడు 88వ వార్షికోత్సవ మహాసభ నిర్వహించారు. శనివారం బిషప్‌గా సీహెచ్ ఏలియా, వైస్ బిషప్‌లుగా ఐ.విజయ్‌కుమార్, స్టాన్లీ బాబు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో లూథరన్ చర్చి పెద్దలు సాలి లాజర్‌బాబు, నాయుడుపల్లి యాకోబు, సిక ఆనంద్, సాలి నరేష్,బట్టు సామెల్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ



నెహ్రూ నగర్: యువత మత్తు పదార్థాలకు దూరంగా, వాటికి బానిస కాకుండా సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఈ మారయ్య బాబు పేర్కొన్నారు. శనివారం పొన్నూరు రోడ్డులోని హుస్సేన్ నగర్ ప్రాంతంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలను తాగడం ద్వారా విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల అమ్మకం, వినియోగాన్ని నిర్మూలించడానికి తీసుకోవాల్సిన నివారణ చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గుంటూరు గుంటూరు– 1 టౌన్ ఎక్సైజ్ స్టేషన్ బి.లత, ఎస్ఐలు షరీఫ్, తిరుమలేశ్వర రావు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా బీజేపీ కృషి

గుంటూరు మెడికల్: గుంటూరు ఈస్ట్ 6వ మండలం 'గావ్‌చలో అభియాన్' కార్యక్రమం బీజేపీ నాయకులు శనివారం నిర్వహించారు. ఈస్ట్ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ పాల్గొన్నారు. నాజ్ సెంటర్‌లోని మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ శనక్కాయల ఉమశంకర్ మాట్లాడుతూ బీజేపీ వికసిత్ భారత్ ధ్యేయంగా అంత్యోదయ సిద్ధాంతానికి కట్టుబడి ఉందన్నారు. స్థానిక ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ సందర్శించిఉచిత ఔషాధాల పంపిణీ గురించి తెలుసుకున్నారు. సెంటర్‌కు అవసరమైన మెడిసిన్ స్టోరేజ్ రాక్స్‌ను పార్టీ 6వ మండల నాయకులు మైలవరపు ప్రవీణ్, వేమూరి అనిల్ సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మలిశెట్టి పవన్ కుమార్, నాయకులు సురేష్ కుమార్ జైన్, రామకృష్ణ, మోతె శేషగిరి, వేమూరి అనిల్ పాల్గొన్నారు.

ముగిసిన హాకథాన్ ఎక్స్ సెమీ ఫైనల్



విజేతలకు నమూనా నగదు చెక్కును అందజేసిన ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, వీసీ

తాడికొండ: వీఐటీ ఏపీ విశ్వ విద్యాలయంలో నేషనల్ సైబర్ సెక్యూరిటీ రీసెర్చ్ కౌన్సిల్ నిర్వహించిన ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి హ్యాకథాన్ ఎక్స్ సెమీ ఫైనల్స్ ముగిసినట్లు వర్సిటీ వీసీ ఎస్‌వీ కోటా రెడ్డి తెలిపారు. ఏపీ– తెలంగాణ నుంచి వివిధ జట్ల నుంచి సెమీ ఫైనల్‌లో మొత్తం 150 మందికి పైగా పాల్గొనగా విజేతలను ఎంపిక చేసి నగదు బహుమతి అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో సవాళ్లు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, సైబర్ భద్రత ఇకపై ఒక ప్రత్యేక అంశం కాదన్నారు. ఇది జాతీయ ప్రాధాన్యత అన్నారు. మరో అతిథి ఎన్‌సీఎస్ఆర్‌సీ డైరెక్టర్ డాక్టర్ ఈ ఖలీరాజ్ నాయుడు మాట్లాడుతూ నైపుణ్యం కలిగిన సైబర్ భద్రతా నిపుణుల అవసరం పెరుగుతుందని, హ్యాకథాన్ ఎక్స్ వంటి అనుభవపూర్వక అభ్యాస వేదికల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. విఐటీ ఏపీ వర్సిటీ వీసీ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించడానికి, అభివృద్ధి చెందుతున్న రంగాలలో భారతదేశ యువతను శక్తివంతం చేసే చొరవకు మద్దతు ఇవ్వడానికి తమ వర్సిటీ నిబద్ధతతో ఉందన్నారు. హ్యాకథాన్ వంటి కార్యక్రమాల ద్వారా దేశానికి సురక్షితమైన డిజిటల్ భవిష్యత్తును నిర్మించడంలో సహాయపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన జట్లకు అతిథుల చేతుల మీదుగా నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కోప్ డీన్ డాక్టర్ సుధాకర్ ఎలాంగో, ఈవెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ సయ్యద్ హుస్సేన్, అసోసియేట్ డీన్ డాక్టర్ సరోజ్ కుమార్ ప్రాణిగ్రాహీ పలువురు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రతిభ చూపిన పేదింటి ఆణిముత్యాలు



వెంకటేశ్వరమ్మ



బి కిషోర్



షేక్ ఖాజా మొహిద్దీన్



ఎస్. కృష్ణవేణి



విద్యార్థిని శివకుమారి

తాడికొండ: ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపించారు తాడికొండకు చెందిన నడికుదిటి వెంకటేశ్వరమ్మ, బత్తుల కిషోర్‌లు. తాడికొండ ఎస్‌వీవీ ఉన్నత పాఠశాలలో చదివి 10వ తరగతిలో వెంకటేశ్వరమ్మ 568, బత్తుల కిషోర్ 566 మార్కులు సాధించారు. వీరిలోని ప్రతిభను గుర్తించిన పాఠశాల క్రాఫ్ట్ మాస్టారు మదమంచి చంద్రశేఖర్ తన మిత్రుల సహకారంతో ఏరువ కోటిరెడ్డి మెమోరియల్ స్కాలర్‌షిప్, యూఎస్ఏకి చెందిన సాయిరాం ఆర్థిక సహకారంతో గుంటూరులోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో వారిని చేర్పించారు. ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో నడికుదిటి వెంకటేశ్వరమ్మ 461/470 మార్కులు సాధించగా, బత్తుల కిషోర్ 441/470 మార్కులు సాధించి తమలోని ప్రతిభను, పాఠశాల పేరును ఇనుమడింపజేశారని ఉపాధ్యాయులు మదమంచి చంద్రశేఖర్ తెలిపారు. తాడికొండలో ఎస్‌వీవీ ఉన్నత పాఠశాల స్థాపించిన విద్వాన్ శ్రీ గోగినేని కనకయ్య స్ఫూర్తితో ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు సహాయం అందించిన యూఎస్ఏకు చెందిన సాయిరాంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు

హైస్కూల్ ప్లస్‌లో సత్తా చాటిన విద్యార్థినులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్‌లో వడ్డేశ్వరానికి చెందిన విద్యార్థినులు పరీక్ష ఫలితాల్లో సత్తా చాటినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. సుబ్బారావు శనివారం తెలిపారు. మొత్తం 21 మంది ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 10 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. మూడేళ్ల క్రితం వడ్డేశ్వరంలో ప్లస్ స్కూల్ ఏర్పాటు చేయగా మొదటి బ్యాచ్ ఇంటర్ మీడియట్‌ను పూర్తిచేసుకున్నారని, ఇదే పాఠశాలలో పదవ తరగతి చదివి, ఇంటర్ మీడియట్ పూర్తిచేసిన వడ్డేశ్వరంకు చెందిన శివకుమారి ఎంపీసీ గ్రూప్‌లో 893 మార్కులు సాధించి ప్రథమ స్థానంలోను, షేక్ రష్మాకు 855 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచిందని తెలిపారు.

రాణించిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని పెనుమాకలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ శేఖర్‌బాబు శనివారం తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో షేక్ ఖాజా మొహిద్దీన్ 826(ఎంపీసీ), ఎస్. కృష్ణవేణి 810(హెచ్ఈసీ) మార్కులు సాధించారని తెలిపారు. సెకండ్ ఇయర్ 70 శాతం, మొదటి సంవత్సరం 55 శాతం విజయం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

మార్నింగ్‌స్టార్ విద్యార్థుల ప్రతిభ

ఫిరంగిపురం: ఇంటర్ ఫలితాల్లో స్థానిక మార్నింగ్ స్టార్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపర్చినట్లు ప్రిన్సిపల్ హరినాథరెడ్డి శనివారం తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ విభాగాలల్లో విద్యార్థులు కె.మరియపావని 922, కె.నమ్రత 905, కె.పండు 852 మార్కులు సాధించారని చెప్పారు. అలాగే జూనియర్ ఇంటర్‌లో వై.అశోక్ 442, కె.సుకన్య 397, కె.కార్తీక్ 418మార్కులు సాధించారని వెల్లడించారు. విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ మద్దు బాలస్వామి అభినందించారు.

- మండలంలోని మునగపాడు జెడ్పీహెచ్ఎస్‌లోని కళాశాలలో విద్యార్థులు ప్రతిభ కనపర్చినట్లు హెచ్ఎం అంజనాదేవి తెలిపారు. ఇంటర్ ఫస్టియర్‌లో షేక్, రుక్సానా 764, రెండో సంవత్సరంలో షేక్. సమీర 762 మార్కులు సాధించారన్నారు.

కార్మికుల సమస్యపై మంత్రి లోకేష్ స్పందించాలి

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యల పట్ల మంత్రి నారా లోకేష్ స్పందించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ అన్నారు. శనివారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు 130వ రోజుకు చేరుకోగా దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గ సమస్యను ప్రభుత్వం పట్టించుకుని పరిష్కరించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులను ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యెహోషువా, సుబ్బారావు, హగ్గయ్య, గురవయ్య, ఇస్మాయిల్, ఇమాంబి, రమణ, సువర్చలాదేవి, మల్లేశ్వరి, శారద,రమాదేవి, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మధ్య అంబేడ్కర్ జయంతి



ఫిరంగిపురం: మండలంలోని వేమవరం ప్రాథమిక పాఠశాలలో శనివారం డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. విద్యార్థులకు అంబేడ్కర్ విద్యాభ్యాసం ప్రస్థానం గురించి వివరించారు. విద్యార్థులు అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ వేషధారణలతో అలరించారు. విద్యార్థులను పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ జెట్టి సుబ్బయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దీవి కమల్‌మోహన్, శేషు రవి, తల్లిదండ్రులు శ్యామ్, భాను ప్రకాష్, శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్ పద్మ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత



తాడేపల్లి రూరల్ : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను తెలుగుదేశం పార్టీ తాడేపల్లి నాయకులు శనివారం లబ్ధిదారుల నివాసాలకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో తాడేపల్లి పట్టణం 12వ వార్డుకు చెందిన అద్దంకి చంద్రశేఖరరావుకు రూ.91,151, 13వ వార్డుకు చెందిన మేకల పూజకు రూ.1,10,000 చెక్కులను లబ్ధిదారులకు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు అధ్యక్షుడు షేక్ బాయ్ మస్తాన్, 13వ వార్డు అధ్యక్షుడు కాకమాను కుమార్, మంగళగిరి మైనార్టీ కమిటీ నాయకులు ఎస్‌కె సైదా, నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో శనివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో చండీ హోమం నిర్వహించారు. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా విశ్వ శాంతిని కాంక్షిస్తూ చేపట్టారు. బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులతో తొమ్మిది మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివ లింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, రుద్ర, లక్ష్మీగణపతి, చండీ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు.

సమ సమాజ వ్యవస్థాపకుడు పూలే

- వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఘనంగా పూలే జయంతి
- ఘనంగా నివాళులర్పించిన వేమారెడ్డి, మురుగుడు

మంగళగిరి: సమ సమాజ వ్యవస్థాపకుడు పూలే అని వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పేర్కొన్నారు. ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే 198 వ జయంతి నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ పూలే అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో మహిళాభివృద్ధి కోసం కృషి చేశారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కొరకు నిరంతరం పోరాడిన పూలే దంపతులు మహిళలకు విద్యను అందించాలని మార్గదర్శకులుగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు పాటిబండ్ల కృష్ణమూర్తి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు ఊట్ల పాలశ్రీనివాస రావు, దివ్యాంగ విభాగం అధ్యక్షుడు బొక్కా అగస్టీన్, మంగళగిరి పట్టణ,రూరల్, తాడేపల్లి రూరల్ మండల అధ్యక్షులు ఆకురాతి రాజేష్, నాలి వెంకటకృష్ణ, అమరా నాగయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు తాడిబోయిన సుబ్బారావు, నియోజకవర్గ చేనేత విభాగం అధ్యక్షుడు పూజాల మనోహర్, జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, మహిళా నాయకురాలు సంకె సునీత తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు

రాజ్యాంగానికి విరుద్ధంగా వక్ఫ్ సవరణ బిల్లు



వక్ఫ్ సవరణ బిల్లు ప్రతులను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

మంగళగిరి టౌన్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధంగా అమలు చేసిన వక్ఫ్ సవరణ చట్టం మత స్వేచ్ఛను హరించే విధంగా ఉందని సీపీఐ నాయకులు విమర్శించారు. మంగళగిరి పట్టణ పరిధిలోని గౌతమబుద్ధ రోడ్‌లోని పాతబస్టాండ్ వద్ద నుంచి శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం వక్ఫ్ సవరణ చట్టం ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పలువురు సీపీఐ నాయకులు మాట్లాడుతూ వక్ఫ్ భూములను కార్పొరేషన్ శక్తులకు కట్టబెట్టేందుకే ఈ చట్టసవరణ బిల్లును మోదీ ప్రభుత్వం ఆమోదించిందని విమర్శించారు. ముస్లిం ప్రజల అభ్యున్నతి కోసం ప్రార్థన మందిరాల కోసం కేటాయించిన లక్షలాది ఎకరాల వక్ఫ్ భూములను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకే రాజ్యసభలో ఈ బిల్లును ఆమోదింపజేశారని మండిపడ్డారు. దేశంలో మైనార్టీల పరిస్థితి దీనాతిదీనంగా ఉందని జస్టిస్ సత్యానంద్ కమిటీ చెప్పినప్పుడు మైనార్టీలను ఉద్ధరిస్తామని చెప్పిన మోదీ ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం వారి హక్కులను హరిస్తూ దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, నాన్ పొలిటికల్ జెఏసి కన్వీనర్ మహమ్మద్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు విడనాడండి



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ ప్రొహిబిషన్ అధికారులు

మంగళగిరి: మత్తు పదార్థాలను విడనాడి తమ భవిష్యత్తును కాపాడుకోవాలని గుంటూరు ఎక్సైజ్ ప్రొహిబిషన్ అధికారి వి.అరుణకుమారి విద్యార్థులకు సూచించారు. నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట నిర్మల ఫార్మసీ కళాశాలలో శనివారం మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అరుణకుమారి మాట్లాడుతూ సరదా కోసం మత్తు పదార్థాలు అలవాటు చేసుకుంటే జీవితాలను చిన్నాభిన్నం చేస్తుందన్నారు. విద్యార్థులు విద్యపై దృష్టి సారించి, తమ జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఈ మారయ్యబాబు, మంగళగిరి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.వీరాంజనేయులు, కళాశాల ప్రిన్సిపల్ పాములరెడ్డి, డాక్టర్ మానస పాల్గొన్నారు.


కేఎల్‌యూలో జాతీయ సదస్సు



ముఖ్య అతిథులను సత్కరిస్తున్న డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో శనివారం 'కృత్రిమ మేధస్సు ఎమర్జింగ్ టెక్నాలజీల యుగంలో స్థిరమైన నిర్వహణ' అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఎస్.రమేష్‌బాబు సభాధ్యక్షత వహించగా, సదస్సు లక్ష్యాలను కన్వీనర్ డాక్టర్ కె.ఎస్. వెంకటేశ్వరకుమార్ వివరించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ మానవ చరిత్రలో కీలకమైన దశలో ఉన్నాయన్నారు. కృత్రిమ మేధస్సు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు విఘాతం కలిగించే సవాళ్లను మాత్రమే కాకుండా స్థిరమైన వృద్ధిని, నైతిక పాలనను నడిపించడానికి అపారమైన అవకాశాలను కూడా అందిస్తున్నాయన్నారు. ముఖ్య అతిథి యూకేలోని లియో గ్లోబల్ ఓవర్‌సీస్ అంతర్జాతీయ డైరెక్టర్ డేవిడ్ ఫాలన్ మాట్లాడుతూ సమ్మిళిత సాంకేతిక వృద్ధి ప్రాముఖ్యత వివరించారు. కార్గోమెన్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ కమల్ జైన్ స్థిరత్వంతో కృత్రిమ మేధస్సును సమగ్ర పరచడంలో ఆచరణాత్మక చిక్కులను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సురేష్ పళిని స్వామి, యూనివర్సిటీ వీసీ డాక్టర్ పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె. రాజశేఖరరావు, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం. కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఎస్. రమేష్‌బాబు, సదస్సు కన్వీనర్ డాక్టర్ కేఎస్ వెంకటేశ్వర కుమార్ పాల్గొన్నారు.

కాటూరి ఆర్ట్ గ్యాలరీ సందర్శించిన గిన్నిస్ రికార్డర్



తెనాలి: కేరళ రాష్ట్రానికి చెందిన అంతర్జాతీయ చిత్రకారుడు, రెండు సార్లు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు విజేత రాజశేఖరన్ పరమేశ్వరన్ శనివారం తెనాలిలోని కాటూరి ఆర్ట్ గ్యాలరీని సందర్శించారు. గ్యాలరీలోని వివిధ శిల్పాలను సందర్శించారు. శిల్పులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. వేర్వేరు మెటీరియల్స్‌తో రూపొందించిన వందలాది శిల్పాలను తిలకించిన ఆయన, ఇలాంటి స్థాయి గ్యాలరీలు సాధారణంగా పెద్ద నగరాల్లో మాత్రమే కనిపిస్తాయని, అలాంటి విశిష్ట గ్యాలరీ ఒక చిన్న పట్టణమైన తెనాలిలో ఉండటం ఆశ్చర్యంగా ఉందన్నారు. శిల్పకారులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్షను ఆయన అభినందించారు.

బైక్ చోరీలకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

పట్నంబజారు: ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. గుంటగ్రౌండ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, కొత్తపేట ఎస్‌హెచ్‌ఓ ఎం .వీరయ్యచౌదరి వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం కోనూరు గ్రామానికి చెందిన కోట అఖిల్‌కుమార్ గుంటూరు నగరంలోని రైలుపేటలో గొలుసు నాంచారమ్మ హైస్కూలు వద్ద తన స్నేహితులతో కలసి రూము అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అమెజాన్‌లో డెలివరీ బోయ్‌గా పనిచేస్తున్నాడు. సులభతరంగా సంపాదించాలని ఉద్దేశంతో చోరీలు చేయడం ప్రారంభించాడు. పక్కా సమాచారం అందుకున్న పోలీసులు ఈనెల 11వ తేదీ రాత్రి రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే క్వార్టర్స్ ఎంట్రన్స్ వద్ద ఎస్ఐ డి.రమేష్, సిబ్బందితో వెళ్లగా నిందితుడు పరారయ్యేందుకు ప్రయత్నించాడు. అఖిల్‌ను పట్టుకుని తమదైన శైలిలో విచారించగా, ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్నట్లు అంగీకరించాడు. రూ.12 లక్షల విలువ చేసే 20 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. సుమారు పది కేసులు నిందితుడిపై నమోదు అయినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సిబ్బందిని అభినందించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com